క్లుప్తంగా

చిన్నారిపై లైంగిక దాడి కేసులో యువకుడి రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారిపై మద్యం మత్తులో లైంగిక దాడికి పాల్పడిన మొగిలి రాకేశ్ అనే యువకుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. ఈ నెల 19న సెలవు దినం కావడంతో ఇంటి వద్ద ఉన్న చిన్నారిపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడు లైంగిక దాడి చేశాడు. ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు అస్వస్థతకు గురైన కూతురిని చూసి జరిగిన అఘాయిత్యంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సైలు తెలిపారు.

బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో..

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన ధరావత్ సందీప్ అనే యువకుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ తెలిపారు. మైనర్ బాలికను కిడ్నాప్, లైంగిక దాడి చేశాడని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ పేర్కొన్నారు.

విరాళం



నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. కాగా, గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ గ్రామస్తుల సహకారంతో రూ. 75 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టింది. మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జోగిపర్తి ఉపేందర్ కవిత దంపతులు రూ. 80,116 విరాళం ఆయల కమిటీకి మంగళవారం అందజేశారు. ఆంజనేయులు, రఘుపతి రెడ్డి, పెద్దాపురం, రమేష్ రెడ్డి, బాలయ్య, రాజు ఉన్నారు.

కష్టాల్లో అండగా ఉంటా..



జనగామ: నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే, కష్టాల్లో అండగా ఉంటానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సొంత దవాఖాన నీలిమ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నియోజక ప్రజలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

పరామర్శ

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు చిన్న బోయిన రాజు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగా, మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజును పరామర్శించారు. అలాగే వడ్లకొండ గ్రామంలో గంగు శ్రీనివాస్‌రెడ్డి తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హామీలు నెరవేర్చాలి

మాజీ ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెవేర్చాలని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం రైతులకు మద్దత్తుగా నిరసన దీక్ష కార్యక్రమం పార్టీ మండల కన్వీనర్ మాలోత్ రమేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని అన్నారు. రైతు భరోసా రూ. 15వేలకు తగ్గకుండా అందించాలని, అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎడవెల్లి కృష్ణారెడ్డి, కేసీరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీశ్, బత్తుల రాజన్ బాబు, కలకోల రజనీకుమార్, వెన్నం మాధవ రెడ్డి, ఉడుత వెంకన్న, రాజు పాల్గొన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారులను ఆదుకోవాలి

పాలకుర్తి టౌన్: బ్యాండ్ వాయిద్య కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుమ్మడిరాజు నాగరాజు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాండ్ కళాకారులకు గుర్తింపు కార్డులు, 50 ఏళ్లు పైబడిన వారికి రూ.10 వేల పెన్షన్‌తోపాటు హెల్త్ కార్డు ఇవ్వాలన్నారు. అనంతరం బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు.

రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో!

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజలు
- పలు లోలెవల్ కల్వర్టులతో వాహనదారులకు ఇబ్బందులు
- విశ్వనాథపురం–తానేదార్‌పల్లి రోడ్డు విస్తరణ చేస్తే పలు గ్రామాలకు ప్రయోజనం



తానేదార్‌పల్లిలో ప్రమాదకరంగా ఉన్న లోలెవల్ కల్వర్టు



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్–పాలకుర్తి ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న విశ్వనాథపురం–తానేదార్‌పల్లి రోడ్డు ఏళ్ల తరబడి విస్తరణకు నోచుకోక ప్రజలు పాట్లు పడుతున్నారు. విశ్వనాథపురం క్రాస్‌రోడ్డు నుంచి జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జీ) గ్రామం వరకు ఈరోడ్డు దాదాపు పదహారు కిలోమీటర్ల మేర ఉంటుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు సింగిల్‌రోడ్డు కావడానికి తోడు రోడ్డుపై పలుచోట్ల గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి పాలకులు ఈ రోడ్డు విస్తరణపై చేస్తున్న హామీలు ఇంతవరకూ నోచుకోవడం లేదు. గత ఐదేళ్లుగా ఈరోడ్డుపై వాహనాల రద్దీ పెరగడంతో ఇరుకురోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మట్టిలోడ్ వాహనాలతో ధ్వంసమైన రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తానేదార్‌పల్లి, జఫర్‌గడ్ మండలంలోని తీగారం ఏనెల నుంచి అనునిత్యం ఈరోడ్డు వెంట మట్టిలోడ్ భారీలారీలు వెళ్తుంటాయి. దాంతో దశాబ్దాల క్రితం వేసిన బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పలుమార్లు తానేదార్‌పల్లి, తీగారం గ్రామాలకు చెందిన ప్రజలు భారీ టిప్పర్ వాహనాలను అడ్డుకున్న సంఘటనలు ఉన్నాయి. రోడ్డు బాగుచేయాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో పలుమార్లు రోడ్డు విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

లోలెవల్ కల్వర్టుతో ఇబ్బందులు

విశ్వనాథపురం క్రాస్‌రోడ్డు నుంచి తమ్మడపల్లి(జీ) గ్రామానికి 16 కిలోమీటర్ల దూరం ఉండగా 11 లోలెవల్ కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరుకు రోడ్డు, లోలెవల్ కల్వర్టులతో ఈరోడ్డుపై గతంలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘనలు ఉన్నాయి. రోడ్డు విస్తరణ చేపడితే ఘన్‌పూర్ మండలంలోని విశ్వనాథపురం, తానేదార్‌పల్లితో పాటు జఫర్‌గడ్ మండలంలోని తమ్మడపల్లి, సూరారం, తీగారం గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాగా, ఇటీవల తానేదార్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కాగా, త్వరలోనే రోడ్డు విస్తరణ జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

హైలెవల్ కల్వర్టులు ఏర్పాటు చేయాలి



విశ్వనాథపురం–తానేదార్‌పల్లి రోడ్డును విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టి లోలెవల్ కల్వర్టుల స్థానంలో హైలెవల్‌కల్వర్టులు ఏర్పాటు చేయాలి. స్థానిక ఎమ్మెల్యే, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా రోడ్డు సమస్యను పరిష్కరించి వారి చిత్తశుద్ధి చాటుకోవాలి.

– మాచర్ల గణేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకెళ్లాం..



విశ్వనాథపురం–తానేదార్‌పల్లి రోడ్డు సమస్యను ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రోడ్డు సమస్యను పాలకులు పట్టించుకోలేదు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్య త్వరలో ఎమ్మెల్యే కడియం చొరవతో తీరనుంది.

– మంతెన ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు

బ్లాస్టింగ్, మట్టి తవ్వకాలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెంలో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా నెల రోజులుగా ఎత్తు గుట్టపై అక్రమంగా బ్లాస్టింగ్, మట్టి తవ్వకాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు నిరసన తెలిపిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అక్రమంగా బ్లాస్టింగ్, మట్టి తవ్వకాలు చేస్తున్న వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం పక్కనే ఉన్న రామలింగం బోడును రియల్టర్ కొనుగోలు చేసి ఎత్తుగుట్టపై ఇష్టారీతిన బ్లాస్టింగ్ చేస్తుండటంతో ఇళ్లు కంపిస్తున్నాయని వాపోయారు. అంతేకాకుండా ఇటాచ్, పొక్లెయినర్‌తో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టడంతో గతంలో నాబార్డు, జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఇంకుడు గుంతలు నామరూపాల్లేకుండా పోయాయని ఆరోపించారు. బ్లాస్టింగ్, మట్టి తవ్వకాలతో వరద నీరు నేరుగా గ్రామంలోకి ప్రవహిస్తే గ్రామానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో మాజీ సర్పంచ్‌లు తోకల వెంకటయ్య, శాగ సునితరాజు, గ్రామ పెద్దలు వారాల రమేష్, శాగ కుమార్, కావటి యాదగిరి, మహిపాల్, ప్రవీణ్, మహేందర్, రాజు, కత్తుల రాజు, కిష్టయ్య, గట్టయ్య పాల్గొన్నారు.

నాడు జలకళ.. నేడు విలవిల

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: నాడు బీఆర్‌ఎస్ హయాంలో చెరువులు జలాలతో కళకళలాడేవి.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపాలనలో విలవిలాడుతున్నాయని, ఎండిన కొన్నె చెరువును చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొన్నె గ్రామంలో కోడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వాటర్ క్యాన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫౌండేషన్ నిర్వహకుడు కోడూరు శివకుమార్ గౌడ్ రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత యువత కోసం గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇర్రి రమణారెడ్డి, వేముల సాగర్‌గౌడ్, చంద్రారెడ్డి, అనిల్‌రెడ్డి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి



జనగామ రూరల్:రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏకశిలా పబ్లిక్ స్కూల్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డివిజన్‌లోని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు రోడ్డు భద్రత విషయంలో అవగాహన ఉండాలని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం ఆర్టీఓ అధికారులచే డ్రైవర్లకు యూనిఫామ్‌లు అందజేశారు. పప్పు వెంకట్ రెడ్డి, ఏకశిలా విద్యాసంస్థల సెక్రటరీ ఉపేందర్ రెడ్డి, అరబిందో పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, నిమ్మ రామ్ రెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

‘సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం’

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గరిపెల్లి చంద్రం అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం జరిగిన తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో లేబర్‌కమిషనర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య, ఉపాధ్యక్షుడు అమరాజు బాబు, నాయకులు యాదగిరి, జోజి, రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు అక్షరాలు నేర్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్: బడీడు పిల్లలు అక్షరాలు నేర్వాలని, అప్పుడే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుందని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలో జరుగుతున్న బడిబయట ఉన్న పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని ఘన్‌పూర్ ఆవాసప్రాంతం ఎస్సీ కాలనీలో ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బడి బయట ఉన్న బడీడు పిల్లల గుర్తింపు సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఎంఈఓ కొమురయ్య, హెచ్ఎం సంపత్, ఎమ్మార్సీ సిబ్బంది గిరి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యనిర్వహణ అధికారి డాక్టర్ వి.రఘుబాబు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధిసంస్థ, పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఉత్తమ పాడిరైతు చింతకుంట్ల ఉపేందర్‌రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎల్ఎస్ శ్రీనివాస్, ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రలు రాజేష్, భిక్షపతి, రజాక్, ఇంటాస్ ప్రతినిధి శ్రీధర్, పాడిరైతులు పాల్గొన్నారు.

అండర్ డ్రైయినేజీ పనులు ప్రారంభం

- అడ్డుకున్న ప్రజలు



డీపీఓ, ఆర్డీఓతో మాట్లాడుతున్న కాలనీవాసులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రందలోని 16వ వార్డులో అండర్ డ్రైయినేజీ నిర్మాణం కోసం మంగళవారం అధికారులు పనులు ప్రారంభించగా వార్డు ప్రజలు అడ్డుకున్నారు. 16వ వార్డులో నెలకొన్న డ్రైయినేజీ సమస్య పరిష్కారం కోసం రూ.8 లక్షలు జీపీ నిధులతో 200 మీటర్ల అండర్ డ్రైయినేజీ నిర్మాణం కోసం మంగళవారం డీపీఓ స్వరూపరాణి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న తదితరులు పనులు ప్రారంభించేందుకు వచ్చారు. అయితే విషయం తెలుసుకున్న కాలనీవాసులు అండర్ డ్రైయినేజీ నిర్మాణంతో పలు ఇళ్లు ధ్వంసమవుతాయని, డ్రైయినేజీ నీరు సాఫీగా ఎలా వెళ్తాయని పలువురు ప్రశ్నించారు. ముందుగా సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నతర్వాతనే పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. అయినప్పటికీ అధికారులు హడావిడిగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించి వెళ్లారు. ఈవిషయమై కాలనీవాసులు విమర్శలు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయశ్రీ, ఏఈ రజిత, కార్యదర్శి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లతో ఉద్యోగి

జనగామ రూరల్: పట్టణంలోని రతన్ ట్రేడర్స్ నుంచి 50 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అధికారి పులి శేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని షాపుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తే రూ.5 వేల నుంచి రూ25 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు చేయూత



రఘునాథపల్లి: నగదు ఇస్తున్న నాయకులు



పాలకుర్తి: చెన్నూరులో..



కొడకండ్లలో..

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు మల్కపురం మహేందర్‌గౌడ్ (41) తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న కొండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో పేదరికానికి చెందిన బాధిత కుటుంబానికి రూ.20 వేల సాయం అందజేసి దాతృత్వం చాటారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, కేపీఎస్‌ఆర్ స్థానిక వలంటీర్లు, నాతి గణేష్, బొడిగె అంజయ్యలు గౌడ సంఘాల నాయకులతో రఘునాథపల్లికి చేరుకుని మృతుడి చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.20వేల సాయం అందజేశారు. శ్రీనివాస్, వెంకటేష్, రాజయ్య, రాజు, రవి, శ్రీనివాస్, లక్ష్మయ్యగౌడ్, సమ్మయ్య, లక్ష్మీనారాయణ ఉన్నారు.

చెన్నూరులో..

పాలకుర్తి: చెన్నూరు గ్రామంలో గోపగాని వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం పరపతి సంఘం గౌరవ అధ్యక్షుడు మొల్గూరి యాకయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల సాయం సంఘం తరఫున అందజేశారు. వెంకన్న, యాకన్న, శ్రీనివాస్, శ్రీశైలం, అంజయ్య తదితరులు ఉన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: అనారోగ్యంతో మృతి చెందిన యతిపతి లక్ష్మి కుటుంబానికి దాసరి భిక్షాటన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ.12 వేల సాయం అందించారు. వెంకటేశ్వరస్వామి, రామస్వామి, రవీందర్, వేణుగోపాలస్వామి, నరేష్, రామకృష్ణ, సోమనర్సింహ్మాస్వామి, ఆంజనేయులు, నర్సింహస్వామి, కళ్యాణ్ పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

గ్యాస్ సిలిండర్ లీకై పూరి గుడిసె దగ్ధమైన ఘటనలో సర్వం కోల్పోయిన నిరుపేద కుటుంబానికి మంగళవారం మండల కాంగ్రెస్ నాయకుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాకేష్‌యాదవ్, రాజు, వెంకన్న, సతీష్, సంజీవ, సోమయ్య తదితరులు ఉన్నారు.

రసాభాసగా గ్రామసభలు



జఫర్‌గఢ్: అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు



నర్మెట: దీసీతండాలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై నగేష్



జనగామ: 2వ వార్డు ప్రిస్టన్ మైదానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



జనగామ: 6వ వార్డులో..

- అనర్హులను ఎంపిక చేశారంటూ ఆగ్రహం
- అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం జిల్లాలోని పలు గ్రామాల్లో చేపట్టిన గ్రామసభలు మొదటిరోజు రసాభాసగా జరిగాయి. మంగళవారం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజాపాలనలో పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలోని అర్హుల పేర్లను ప్రకటించారు. గతంలో వచ్చిన వారికే వచ్చాయని, అర్హులకు అన్యాయం జరిగిందని పలువురు ఆరోపించారు. తమ పేర్లు రాలేదంటూ దరఖాస్తు దారులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీపీఓ స్వరూపరాణి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న, డీఆర్‌డీఏ పీడీ వసంత, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, పాల్గొన్నారు. కాగా, తరిగొప్పుల మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల తీరుపై అధికారులను జనగామ ఆర్డీఓ కె.గోపిరాం అడిగి తెలుసుకున్నారు. బచ్చన్నపేట మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలను డీసీపీ రాజమహేంద్రనాయక్ సందర్శించి పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌కు ఎంపిక



జఫర్‌గఢ్: మండలంలోని కూనూరు హైస్కూల్‌కు చెందిన పి. శ్రావ్య తెలంగాణ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌కు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు కె.రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో శ్రావ్య ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికకావడంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

కొడకండ్ల: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తరహాలోనే త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని మండలంలో సత్తా చాటాలని కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మార్కెట్ వైస్ చైర్మన్ సాయి, నాయకులు భిక్షపతి, అంజయ్య, సునీల్‌రెడ్డి, ఖలీం పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పాలకుర్తి టౌన్: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోతన జూనియర్ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు రోడ్డు భద్రతపై, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్సై దూలం పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎండీ మోయినుద్దీన్ పాల్గొన్నారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల మాజీ సర్పంచ్ వల్లాల అశోక్ తల్లి సుశీల (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ నాయకులతో కలిసి కోమల్లకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నిబంధనలు విస్మరిస్తే చర్యలు అనివార్యం


దేవరుప్పుల: రోడ్డు నిబంధనలు విస్మరిస్తే ఎంతటి వారికైన చట్టపరమైన చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఇటీవల రోడ్డు నిబంధనలు విస్మరించిన రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన గొంగిళ్ల కృష్ణకు జనగామ కోర్టు తీర్పు మేరకు నాలుగు రోజుల రిమాండ్ చేసినట్లు తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడోత్సవ్–2025 వాల్ పోస్టర్లను జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి మంగళవారం పట్టణంలో ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు విద్యార్థులకు క్రీడలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ గ్రౌండ్‌లో ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగుతాయని చెప్పారు. క్రీడోత్సవానికి జిల్లా ఇన్‌చార్జ్‌గా గుంటుపల్లి కార్తీక్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివార్ల, మహేందర్ ఉమర్ పాల్గొన్నారు.

క్యాలెండర్..



ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం సంఘం డిపో గౌరవ అధ్యక్షుడు శివరాజ్ యాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.స్వాతి, జి.ఆర్ లింగం, సీనియర్ చీఫ్ అడ్వైజర్ వేమన, శివరాత్రిదుర్గయ్య, సాంబయ్య, శ్రీకాంత్, సిబ్బంది, పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బచ్చన్నపేట: పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు మంగళంపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ట్రస్టు ఆస్పత్రి సహకారంతో మంగళవారం గోపాల్ నగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

‘అనుమతి రద్దు చేయాలి’

బచ్చన్నపేట: మండలకేంద్రంలోని వికాస్ ఐటీఐ(ప్రైవేట్) అనుమతులు రద్దుచేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ అధికారులను కోరారు. మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐటీఐని సందర్శించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రిజిస్టర్‌లో 120 మంది విద్యార్థులు ఉంటే ఒక్క విద్యార్థి రాలేదని, ఈ విషయమై యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, శిక్షణ ఇవ్వకుండా ఉత్తీర్ణత సర్టిఫికెట్లు జారీచేస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వయంపాలన దినోత్సవం



బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

‘సంక్షేమ పథకాల్లో సంపన్నుల పేర్లు’

జఫర్‌గఢ్: ప్రజాపాలనలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హుల జాబితాల్లో సంపన్నుల పేర్లు ఉండటం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

‘సమస్యలకు మోక్షం లేదు’

దేవరుప్పుల: గత ప్రభుత్వాల వైఫల్యాలను అధిగమిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాపాలనలోనూ అపరిష్కృత సమస్యలకు మోక్షంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు సంగారెడ్డిలో తలపెట్టిన పార్టీ రాష్ట్ర మహాసభల విజయవంతానికి విస్తృత ప్రచారం చేపట్టారు.